# పరమేశ్వరుడి తపస్సు

వాగర్థాలవలె విడదీయలేని జంట కోసం ఎదురు చూస్తున్నాడు ఇటీవలనే జన్మదిన రజతోత్సవం జరుపుకున్న పరమేశ్వరుడు.

ఒక పార్వతి కోసం అన్వేషణ ప్రారంభించాడు. పర్వత రాజపుత్రి ఐన పార్వతి అంటే ఎలావుంటుందో - అలాంటి పార్వతిని మాత్రం తను కోరుకోలేదు. ఎందుకంటే తానే, ఐదడుగుల పొడవుండి, సన్నగా వుండే 'సన్నా'సి. అందంగా, నాజూకుగా, మరీ లావు, మరీసన్నం కాకుండా వుండే ఇరవయ్యేళ్ల అమ్మడు కావాలి. ఇన్ని హంగులూ ఉన్న అమ్మాయి దొరికితే, పోనీ కట్నం లేకుండా పెళ్లి చేసుకుంటాడా అంటే అదీ లేదు. కట్నం ఏమీ పెద్దగా ఆశించలేదు కాని, ఓ రెండు లక్షలు మాత్రమేకోరుకున్నాడు; ఎన్ని లక్షల రూపాయలకి చెక్కు రాసినా చివర 'ఓన్లీ' అని రాసినట్టు. పోనీ పరమేశ్వరుడు పెద్ద హెూదా ఏమైనా వెలగబెడుతున్నాడా అంటే అదీ లేదు. రాష్ట్ర ప్రభుత్వంలో ఓ జూనియర్ అసిస్టెంటు, వురఫ్ ఎల్‌డీసీ!

"నీలో ఏ ప్రత్యేకతలున్నాయని, అందమైన, నాజూకైన 4'-10" మించని, రెండు లక్షలు ఇవ్వగలిగిన అమ్మాయిని కోరుకుంటున్నావయ్యా" అంటే- "నేను మగాడిగా పుట్టడమే ఓ క్వాలిఫికేషను" అంటాడు పరమేశ్వరుడు.

ఐతే నల్లధనం బాగా మూలుగుతున్న 'నల్లతంబీ'లు కొందరు తమ అమ్మాయిల్ని ఆఫర్ చేశారు పరమేశ్వరుడికి. పరమేశ్వరుడు వాళ్లందరికి ఏదో వంక పెట్టి తిరస్కరించాడు.

ఇప్పుడు పరమేశ్వరుడు ముదిరిన బెండకాయ. జన్మదిన స్వర్ణోత్సవ సమయం ఆసన్నమయినా - ఉత్సవం జరుపుకోలేదు. కారణం తనకి యాభైనిండినట్టు తెలిసిపోతుంది గనుక! కుమారుడైన పరమేశ్వరుణ్ణి ఓ యింటివాణ్ణి చెయ్యలేక పోయామే అనే బెంగతో పరమేశ్వరైక్యం చెందారు తల్లిదండ్రులు.

ఈనాడు పరమేశ్వరుడు ఎమ్మార్వో హోదాలోకి ఎదిగినా- ఇప్పుడు పిల్ల నిస్తామని ఎవరూ ముందుకి రావడంలేదు.

యాభై ఏళ్లున్న పరమేశ్వరుడికి చుట్టుపట్ల వున్న నాలుగు జిల్లాల వాళ్లూ తమ పిల్లల్ని ఆఫర్ చెయ్యలేదు.

తన వయస్సు పదిహేనేళ్లు తగ్గించుకుని 35 ఏళ్ల యువకుడైపోయి- 'వధువు కావలెను' అని పత్రికా ప్రకటన చేయించాడు. నెల్లూరునుంచి ఓ పాతికేళ్ల యువతి తల్లిదండ్రులు పరమేశ్వరుడి పత్రికా ప్రకటనకి ప్రతిస్పందించారు. అమ్మాయి పేరు కూడా పార్వతే! ఆది దంపతులైన పార్వతీ పరమేశ్వరులవలె వాగర్థ ప్రతిపత్తి కలిగి వుంటామని ఆశించాడు పరమేశ్వరుడు.

నాల్రోజులు సెలవు పెట్టుకుని నెల్లూరు ప్రయాణ మయ్యాడు పరమేశ్వరుడు. బట్టతల కనబడకుండా విగ్గు తగిలించాడు. ముడుతలుపడ్డ బుగ్గలు కనబడకుండా ఏవో క్రీములు ఎప్లై చేశాడు. అన్ని విధాల అందమైన యువకుడిలాగే తయారయ్యాడు.

వధువు తండ్రి పరమేశ్వరుణ్ణి సాదరంగా ఆహ్వానించాడు. లోపల్నుంచి అమ్మాయిని తీసుకురమ్మని ఆజ్ఞాపించాడు భార్యామణిని.

అమ్మాయిని తీసుకొచ్చి ఎదురుగా కూర్చోబెట్టేక, ఏవో నాలుగు ప్రశ్నలు లాంఛనంగా వేసి- పిల్ల నచ్చినట్టు చెప్పేసి, ముహూర్తం కూడా పెట్టించమని చెప్పేసి సెలవు పుచ్చుకున్నాడు పరమేశ్వరుడు.

అమ్మాయి తండ్రి పొంగిపోయాడు!

కాని- అమ్మాయి తల్లి కృంగిపోయింది!

"ఏవండీ!" పిలించింది భర్తని.

వెళ్లాడు.

"ఈ పెళ్లి కొడుకు పాతికేళ్ల కిందట నన్ను చూడ్డాని కొచ్చిన పెళ్లికొడుకండీ! ఎలా చూసినా ఇతని వయస్సు ఫైవ్ జీరోకి తక్కువుండదు"

అంది.

మొదట పొంగిపోయిన వధువు తండ్రి ఇప్పుడు కృంగిపోయాడు!

పరమేశ్వరుడు, పార్వతి తండ్రి నుండి శుభవర్తమానం ఎప్పుడు అందుతుందా అని తపస్సు చేస్తూనే వున్నాడు! కైలాసగిరిమీద కాదు. ఎమ్మార్వో ఆఫీసులో!

మనిషి ఆశాజీవి కదా మరి?

● ఆంధ్రసచిత్ర వారపత్రిక ●

*20–1–89*